# నీటిబీట

ఒకప్పుడు నాకు నీళ్లంటే చచ్చేంత భయం

మా ఊరుపక్కనే కృష్ణ వాగు. సంవత్సరంలో ఎనిమిది నెలలపాటు నీళ్లు ప్రవహిస్తుంటున్నా ఆ నీళ్లల్లో కాలు పెట్టను. మా ఊరిపేరు ఈరారం. మా ముత్తాతల కాలంలో విడపలపాడు నుండి నలభయి కుటుంబాల వరకు ఈరారం వచ్చి స్థిరపడిపోయారు. మా తరానికి వచ్చేసరికి కుటుంబాలు నూటయాభయి వరకు పెరిగాయి. అందులో చాలామంది ఉపాధి వెతుక్కుంటూ అటూ ఇటూ వలస వెళ్ళిపోయారు. ఇరవయి కుటుంబాలు మటుకు మిగిలాయి. చదువుకున్న వాళ్ళెవరూ ఈరారం లోని ఎడారిపల్లెలో ఉండడానికి చాలాకారణాల వలన ఇష్టపడరు. ఎడారిపల్లె అంటే మాదిగపాలెం. మాలో మూడొంతుల మంది రైతుకూలీ పనులకు వెళ్తుంటారు. కొంతమంది పాలేర్లుగా స్థిరపడిపోయారు. నేను కాకుండా మరో ముగ్గురు కులవృత్తిలో ఉండిపోయాం.

ఎడారిపల్లె ఈరారానికి కిలోమీటరు దూరంలో ఉంది. ఈరారంలో వెయిన్నర గడప ఉంటుంది. ఊరుకు కరంటు ఉంది. మంచినీటి సదుపాయం ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. అయితే, మేముంటున్న ఎడారిపల్లెకు విద్యుత్ సౌకర్యం లేదు. సరయిన రోడ్లు లేవు. వర్షాకాలంలో కాలుతీసి కాలువేయడం కష్టమయిపోతుంటుంది. ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. కాని టీచర్లు ఉండరు. మేం అట్టేమంది లేకపోవడం వలనేమో ఎన్నికల సమయంలో మమ్మల్ని పట్టించుకోరు. అధికారులు వచ్చినప్పుడల్లా మా బాధలు తెలియజేసుకుంటూ ఆర్జీలు పెట్టుకుంటుంటాం. అవి గాలికి ఎగిరి పోతుంటాయనుకుంటాను. విసుగెత్తి పోయింది. అంతెందుకు, మా వాళ్ళకెవరికయినా సుస్తీగా ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే, అవసరమయితే అందరికీ ఇంజక్షన్లిచ్చే నర్సమ్మ మమ్మల్ని ముట్టుకోడానికి

ఇష్టపడదు. ఆయా చేత ఇప్పిస్తుంది. ఈ విషయం డాక్టరు దృష్టికి తీసుకువెళ్ళినా అతనేం చేయలేదు. అభిజాత్యానికి గురవ్వని రోజుండదు.

ఈరారానికి దగ్గర ఊరు నర్సాయిపేట. మాకు కావలసినవి నర్సాయిపేట నుండి తెచ్చుకుంటాం. మా చుట్టుపక్కల చాలా గ్రామాలకు నర్సాయిపేట వ్యాపారకేంద్రం. మూడు జూనియర్ కాలేజీలు, రెండు ప్రయివేటు కాలేజీలు, ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఉన్నాయి. రెడ్ల శాతం తక్కువ ఉన్నా, క్రైస్తవ మైనారిటీల పేరున ఇంజనీరింగు కాలేజీ పెట్టబోతున్నారనే వదంతితో ఊరు విస్తరించడం మొదలెట్టింది.

కృష్ణపాయ ఈరారానికి నర్సాయిపేటకు మధ్య ఉంది. ఎండాకాలంలో తప్ప ఆ పాయ ఎండిపోవడం అంటూ ఉండదు. నీళ్ళతో నిండుగానే ఉంటుంది. నర్సాయిపేట వెళ్లాలంటే రెండే రెండు మార్గాలు. ఒకటి బస్సు. అది చుట్టూ తిరిగి వెళ్తుంది. రెండు లాంచి. లాంచిలో అరగంటలో వెళ్ళిపోవచ్చు. కాంట్రాక్టు మీద రెండు లాంచిలు నడుస్తున్నాయి. ప్రతిరోజు నా వృత్తి నిమిత్తం నర్సాయిపేట వెళ్ళాల్సి ఉంటుంది. ఆదివారం నాడు సెలవు తీసుకోవాలని అనిపిస్తుంది. కాని ఆ వేళే చేతినిండా పని ఉంటుంది. ఒకప్పుడు నర్సాయిపేట బస్సుస్టాండు పక్కన చిన్న టెంటు లాటిది వేసుకుని చెప్పులు బాగుచేస్తుండేవాడిని. కొత్తవి తయారు చేస్తుండేవాడిని. నేను ఈ పనులు చేయడం మా పిల్లలకు ఏమాత్రం నచ్చలేదు. నాకు అది తప్ప వేరేపని చాతకాదు. అయినా అది అంత తేలికయిన పనికాదు. అందరికీ చేతకాదు. మాలోనే దాని గురించి తెలియనివాళ్ళు చాలా మంది ఉన్నారు. అసలా పని చేస్తూనే ఎంతో కష్టపడి నా పిల్లలకు చదువులు చెప్పించి పయికి తీసుకువచ్చాను. ఒకడు దుబాయి వెళ్ళాడు. రెండోవాడు రెవెన్యూ డిపార్టుమెంటులో చేరాడు. వాళ్ళిద్దరు ఇచ్చిన డబ్బులతోనే నా టెంటు మూసేసి చెప్పులు, బూట్లు అమ్మే దుకాణం తెరిచాను. యాభయివేల వరకు అయింది. మరో యాభయి వేలుపెట్టి రెండెకరాల భూమి కొన్నాను.

నా జీవితం ఒక గాడిలో పడింది. వారానికొకసారో, పదిరోజులకొకసారో గుంటూరు నుండి చెప్పులు, బూట్లు తెప్పిస్తుంటాను. నా దుకాణంలో ఆడవాళ్ళ చెప్పులు ఎక్కువ అమ్ముడు అవుతూ ఉంటాయి. మంచి డిజయిన్లే తెప్పిస్తుంటాను. ఈ మధ్యే బూట్ల అమ్మకం ఎక్కువయింది. చెప్పులవీ బాగు చేయడానికి నా దుకాణంలోనే ఒక మూల ఒకతన్ని రోజు కూలీకి పెట్టుకున్నాను. అన్ని ఖర్చులు

పోను రోజుకు మూడు వందల యాభయి రూపాయల వరకు మిగులుతుంది. నా వేషభాషల్లో మార్పు తెచ్చుకున్నాను. పంచ బదులు పంట్లాం తొడగడం మొదలెట్టాను. చుట్టలు తాగడం పూర్తిగా మానివేసి సిగరెట్లలోకి దిగాను. గడ్డం రోజూ గీయడం అలవాటు చేసుకున్నాను. మాటలో మర్యాదా మన్ననా మొదటినుండి ఉంది. కాకపోతే పదును పెట్టుకున్నాను. నా వ్యాపారం పుంజుకోడానికి అదెంతో సాయం చేసింది.

రెండు నెలల కిందట మునుస్వామి నా దుకాణానికి వచ్చాడు. అతను నా ఈడువాడు. మా ఊరువాడు. ఏదో తరగతి వరకు కలిసి చదువుకున్నాం. రాజకీయాలంటే ఆసక్తి ఉన్న వ్యక్తి. చాలా సంవత్సరాలు సర్పంచ్‌గా ఉండి కొద్దోగొప్పో వెనకేసుకుని జిల్లాస్థాయికి ఎదిగాడు.

ఒకప్పుడు ఇద్దరం కలిసి కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఎర్రజండాలు పట్టుకు తిరిగాం. పోలీసు లాఠీ దెబ్బలు నాకు తగిలేవి. అతను తప్పించుకునేవాడు. కులం బట్టి పోలీసుల దెబ్బలు ఉండేవి. న్యాయంలోనే కాదు, అన్యాయంలోనూ కుల పట్టింపులు గాఢంగానే ఉంటాయని అప్పటివరకు నాకు తెలియదు. జండాలు మా చేతికిచ్చి పెత్తనం మటుకు అతనూ, తన వాళ్ళ చేతుల్లో ఉంచుకునేవాళ్ళు. ఆ పల్లకి మోయలేక, బయటకు వచ్చేశాను. నాతో పాటు మావాళ్ళూ బయటకు వచ్చేశారు. మాలో ముగ్గురు నలుగురు అన్నల్లో చేరారు. బతికి ఉన్నారో ఎన్‌కౌంటర్‌లకు బలయి పోయారో తెలియదు. పోలీస్ ఎన్‌కౌంటర్లలో చనిపోయేది బడుగువర్గాల వాళ్లే. స్మారకస్థూపాలకు నోచుకోరు. అన్నలు లేపేసే పోలీసు వాళ్ళలో ఎక్కువ మంది బడుగువర్గాలకు చెందినవాళ్ళే ఉంటారు. కావాలనే చేస్తూ ఉంటారనుకుంటాను.

ఇప్పుడు నాకు మునుస్వామితో మునుపటంత సాన్నిహిత్యం లేదు. ఎదురయినప్పుడు పలకరింపుగా తెచ్చిపెట్టుకున్న నవ్వు వదలడంతో ఆగిపోతుంది. స్నేహం ఆగిన చోటునుండి శత్రుత్వం మొదలవుతుంది. ఆ సాయంత్రం నాలుగు గంటలప్పుడనుకుంటాను, మునుస్వామి నా దుకాణానికి వచ్చాడు. అంతకు ముందు కూడా నా దుకాణానికి వచ్చాడు. ధరలు అడిగి ఏమీ కొనకుండా వెళ్ళిపోయాడు. అయిదుగంటలు దాటితేగాని నా దుకాణంలోకి జనం రావడం మొదలుకాదు. దుకాణంలో నేనొక్కడినే కూర్చుని టి.వి.లో క్రికెట్ వస్తోంటే చూస్తున్నాను. నా దగ్గర పనిచేసేతను మునుస్వామి రాకమునుపే టీ తీసుకు రావడానికి బయటకు వెళ్ళాడు.

మునుస్వామి నా దుకాణంలోకి వచ్చీ రాగానే తన కుడికాలి చెప్పు నా ముందు పెట్టి, "తెగింది, కుట్టి పెట్టు" అన్నాడు.

చూసి, "ఉంగటం దెబ్బతింది. కుట్లువేసినా మళ్ళీపోతుంది. కొత్తవి కొనుక్కోకూడదూ?" అన్నాను.

నేనేం తప్పు మాట అనలేదు. ఎందుకనో అతను సీరియస్ అయి, "నీ బోడి సలహా అడిగానట్రా?" అన్నాడు.

అతని మాటకు మనస్సు చివుక్కుమంది. దరిమిలా నన్ను ఎవరూ 'అరే' అని సంబోధించడం లేదు. నాకు దగ్గర వ్యక్తులు తప్ప! "రెండు నిమిషాలు ఆగరా. పని కుర్రాడు వచ్చి కుట్టిస్తాడు" అన్నాను. నేను అతన్ని 'రా' అంటానని ఊహించి ఉండడు.

"నువ్వు కుట్టొచ్చు కదా, మాదిగోడివే కదా?" కోపంగా అన్నాడు.

నర్సాయిపేటలో కాదు కాని ఈరారంలో తెలిసి కూడా, పనికట్టుకుని, "నువ్వు మాదిగోడివి కదూ?" అడుగుతుంటారు. ఏ చదువులేని వాడు అడిగాడంటే పోనీలే అనుకోవచ్చు. చదువుకున్న వాళ్ళు కూడా అడుగుతుంటారు. నేను ఎవరో గుర్తు చేయాలని అనుకుంటుంటారో ఏమో తెలియదు. నానీడ నా ముందో వెనకో ఉంటుంది. నా కులాన్ని చెప్పుకోడానికి నేను సిగ్గుపడను.

"నేను మాదిగనే. ఇప్పుడు చెప్పులు కుట్టడం మానేశానురా" అతనితో గొడవ పడడం నాకు ఇష్టం లేదు. అలా అని చులకన అవ్వదల్చుకోలేదు.

అతని ముఖం జేవురించింది. "నీ షాపు ఇక్కడ ఉండాలా? వద్దా?" అరుస్తున్నట్టుగా అన్నాడు.

"ఏం, తీసేయిస్తావా?" నేనూ అరిచినట్టుగానే అన్నాను.

కుడిచేతి వేళ్ళతో చిటికలు వేస్తూ, "అయిదు నిమిషాల్లో" అన్నాడు.

నా మనసు కుతకుతలాడుతోంది. అతను నాతో పోట్లాట పెట్టుకోడానికే వచ్చి ఉంటాడనిపిస్తోంది. ఈ గొడవ చిలికి చిలికి పెద్దదవ్వడం నాకు ఇష్టం లేదు. తప్పదంటే దేనికయినా నేనూ తయారయి ఉండాలి.

అతను రెండు నిమిషాల పాటు మాట్లాడకుండా ఉంటే గొడవ సమసిపోయిందనుకున్నాను. ఏం కాలేదు. అతని కాలు నా మీదకు లేచింది. అంతకు ఒడికడతాడని నేను ఊహించలేదు. తల పక్కకు జరిపి ఉండకపోతే చెప్పుతో ఉన్న కాలు నా ముఖం మీద పడి ఉండేది. నాకు ఊహ తెలిసి ఎవరూ నా ముఖాన్ని కాలుతో

తన్నలేదు. అతను ఎప్పటినుండి నా మీదకోపం పెంచుకుంటున్నాడో? నేను ఆలస్యం చేయకుండా బల్లమీదున్న గొడ్లచర్మం కోసే కత్తి అందుకుని, "రేయ్, కాలు తెగుద్ది. పిచ్చి పిచ్చి వేషాలేసేవంటే నరికి పోగులు పెడతాను. ఏమనుకున్నావో?" పిచ్చి కోపంతో అని కత్తితోనే కాలు అవతలకు నెట్టేసరికి కింద పడబోయి కుర్చీ పట్టుకుని నిలదొక్కుకున్నాడు.

ముఖానికి చెమట పడుతోంటే కండవాతో ముఖం తుడుచుకుని, "ఈ రిజర్వేషన్ల వలన మీ ఒళ్ళు బలిసిపోతున్నాయిరా" అని నాలుగయిదు బూతుమాటలన్నాడు.

"రేయ్,. ఇప్పుడు నువ్వన్నమాటలకు నీమీద కేసు పెట్టొచ్చు. పెట్టేదా? నా ఒళ్ళు బలిసిపోడానికి నీ దగ్గరేం తిన్నానురా?" లేచి కత్తితోనే వీరాస్వామి దగ్గరకు వచ్చాను. నా మాటలకు భయం వేసిందో లేక నా చేతిలోని కత్తికి భయపడ్డాడో నా కళ్ళల్లోకి చూడడానికి ధైర్యం చాలలేదు. వెళ్ళిపోయాడు. వాళ్ళవాళ్ళనో, పార్టీవాళ్ళనో వేసుకుని వచ్చి మళ్ళీ గొడవ పెట్టుకుంటాడేమోనని ఎదురు చూశాను. రాలేదు. ఎందుకయినా మంచిదని నాకు తెలిసిన లాయరుతో పోలీసు స్టేషను వెళ్ళి కంప్లెయింటు రాసిచ్చాను. నమోదు చేసుకున్నారు.

మునుస్వామితో చాలా దగ్గరగా మెలిగిన వాడిని కాబట్టి అతని గురించి బాగా తెలుసు. ఏమీ లేనట్టు పయికి కనిపించినా కనబడకుండా దెబ్బ కొట్టడం తెలుసు. కేసు అలానే ఉండబట్టి ఏమీ కాదనే నమ్మకం నాకు ఉంది. అక్కడే నేను పొరబడ్డాను.

ఈ రోజుకీ రోజు నేను రేవుకు చేరుకునేసరికి గురవయ్య లాంచి ఒడ్డు ఎక్కి గుంజకు కట్టేసి ఉంది. రిపేరుకు వచ్చినట్టుంది. చుట్టుపక్కల్లో గురవయ్య కనిపిస్తాడేమోనని చూశాను. కనిపించలేదు. రెండోలాంచి కొండలరావుది. అతని అక్కను మునుస్వామి ఉంచుకున్నాడు. కొండలరావు నాకు తెలుసు. నాతో బాగానే ఉంటాడు. మా ఇద్దరి మధ్య ఎటువంటి శతృత్వం లేదు. నాకూ మునుస్వామికి ఉన్న తగాదా గురించి ఎవరికీ తెలియకుండా ఉండదని నేను అనుకోవడం లేదు.

కొండలరావు దగ్గరకు వచ్చి, "నరసాయిపేట వెళ్ళాలి" అన్నాను.

"గురవయ్యకు ఎంతిచ్చేవాడివి?" అడిగాడు.

"అయిదు రూపాయలు."

"ఇరవయి అవుద్ది."

అవసరం నాది కాబట్టి మరో పది ఎక్కువ అడిగినా కాదనే వాడిని కాదు. నాలుగు సంవత్సరాల కిందట వంతెన సగం కట్టి ఆపేశారు. పూర్తి చేయలేదు. ఎండాకాలమయి ఉంటే నీళ్ళుండవు. కాబట్టి నడుచుకుంటూ వెళ్ళిపోయేవాడిని. కొండలరావుతో ఇబ్బంది ఏమిటంటే ప్రయాణీకుల్ని లాంచిలో ఎక్కించుకోవడం, ఎక్కించుకోకపోవడం అతని ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంటుంది. మనిషి మాటలే కాదు. చేష్టలు కూడా కరుకుగా ఉంటాయి. చూడడానికి గుడ్డ లేసుకున్న దున్నపోతులా ఉంటాడు.

ఇరవయి రూపాయలిచ్చి లాంచి ఎక్కాను. గురవయ్య లాంచి మూలపడడంతో కొండలరావు లాంచి నిండిపోయింది. లాంచి కదలబోతుండగా మునుస్వామి పరుగెత్తుకుంటూ వచ్చి ఎక్కి ముందుకు వెళ్ళి కూర్చున్నాడు. ఎక్కేప్పుడు నన్నతను చూశాడు.

లాంచి బయల్దేరింది. ఎగువన వర్షాలు బాగా కురవడం వలన నీటి ప్రవాహం ఉధృతంగానే ఉంది. గాలి విసురుగా వీస్తోంది. లాంచి మెల్లగా నడుస్తోంది.

సగం దూరం వచ్చి ఉంటాం. నీళ్ళ వంక చూస్తూ ఏదో ఆలోచిస్తున్న నా కుడిభుజం మీద చేయి పడేసరికి తేరుకుని వెనక్కి తిరిగి చూశాను. కొండలరావు! అతను నా చేయి అందుకుని నా చేతిలో రెండు పదిరూపాయల నోట్లు పెట్టి, "దిగిపో" అన్నాడు. అతని మాట అతని చేయంత చల్లగా, బలంగా ఉంది.

తెచ్చిపెట్టుకుని నవ్వి, "నీట్లోనా?" అడిగాను.

"ఆ" ముఖం రాయిలో అవుతోంది.

నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. అతను నాతో పరాచికాలు ఆడడం లేదు.

"నిన్నడిగే ఎక్కాను కదా?"

"నీమీద నాకు కోపం లేదు. నువ్వి లాంచిలో రావడం మా బావకు ఇష్టం లేదట. దించేయమంటున్నాడు..."

లాంచికి అటుచివర మునుస్వామి కూర్చుని నీళ్ల లోకి చూస్తూ ఉన్నాడు, తనకేమీ సంబంధం లేనట్టు. నేను చనిపోతే అది ప్రమాదవశాత్తూ జరిగిన మరణం అవుతుంది. మునుస్వామి చేతులు శుభ్రంగానే ఉంటాయి. కేసు ఎగిరిపోతుంది. అతని ఎత్తుకు నేను బలి అవ్వబోతున్నాను.

"మా బావతో మాట్లాడాలని ఉందా?" అడిగాడు.

"లేదు."

"మరి ఆలస్యం ఎందుకు, దూకు."

నేను కాదూ కూడదంటే కొండలరావు నన్ను ఎత్తి వాగులో విసిరేట్టు ఉన్నాడు. లాంచిలో ఉన్న వాళ్లెవరూ అతన్ని కాదని సాక్ష్యం చెబుతారని అనుకోను.

"కొండలరావూ, నాదో మాట వింటావూ?"

"చెప్పు."

"నాకు ఈత రాదయ్యా."

"దానికి నేనేం చేసేది? బతుకుతావో, చస్తావో నాకు తెలియదు...." అని అమాంతంగా నన్ను ఎత్తి ప్రవాహంలో పడేశాడు.

నీళ్లలో మునుగుతోంటే నా పని అయిపోయిందనే అనుకున్నాను. ప్రవాహంలో కొట్టుకుపోతూ ఒక మునక వేశాను. కొండలరావు అసలు ఏం జరగనట్టు చేతులు కుట్టుకుని నావంకే చూస్తున్నాడు. ఎక్కడలేని ధైర్యం తెచ్చుకుని ప్రవాహం వాలుగా కొట్టుకుపోతూ మునిగిపోకుండా కాళ్ళూ చేతులతో నీళ్ళను బలంగా కొట్టడం మొదలుపెట్టాను. కళ్ళల్లోకి నీళ్లు వెళ్తూ ఏమీ కనిపించడం లేదు. కొంతదూరం కొట్టుకుపోయాక గ్రహించాను. నాకు ఈత వచ్చింది. మునిగిపోవడం లేదు. ఈదుతున్నాను. ఈత ఇంత తేలికని తెలిసి ఉంటే, ఎప్పుడో నేర్చుకుని ఉండేవాడిని.

ఇప్పుడు నాకు నీళ్ళంటే భయం లేదు.

❖ ఆదివారం వార్త, 31 ఆగస్టు 2008